సాహితీ స్రవంతిది చారిత్రక అధ్యాయం

● రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి



చతురిక నవలను ఆవిష్కరిస్తున్న కల్కూర, పత్తి ఓబులయ్య, తెలకపల్లి రవి తదితరులు

కర్నూలు కల్చరల్: సాహిత్య చరిత్రలో సాహితీ స్రవంతిది చారిత్రక అధ్యాయమని రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. కామ్రేడ్ తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సందర్భంగా సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయంగా ఆయన నివాసాన్ని మార్చిన నేపథ్యంలో సాహితీ వేత్త, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, టీజీవీ కళా క్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, తెలక పల్లి రవి శనివారం ప్రారంభించారు. తెలకపల్లి రవి పరిశోధనాత్మక సేకరణ 108 ఏళ్ల నాటి కర్నూలు నవల ׀చతురిక׀ను ఆవిష్కరించి మాట్లాడారు. తెలక పల్లి రవి మాట్లాడుతూ సాహిత్య చరిత్రలో కర్నూలు ప్రాంతానికి విశిష్టమైన స్థానం ఉందన్నారు. ఎంతో మంది చారిత్రక పరిశోధనలు, స్వరాజ్యానికి ముందు ఆనాటి సమాజానికి గొప్ప సాహిత్యాన్ని అందించారన్నారు. కర్నూలు కేంద్రంగా అనేక సాహిత్య ఉద్యమాలను తమ నివావాసం నుంచి నడిపామన్నారు. సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలకు ఎంతో చేయూతనిచ్చిన నరసింహయ్య ఆశయాలకు పునరంకితం అవుదామన్నారు. అంతకు ముందు నరసింహయ్య చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, ప్రముఖ నవలా రచయిత అజీజ్ మాట్లాడారు. సాహితీ స్రవంతి జిల్లా గౌరవాధ్యక్షులు బసవరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప, ఆవుల చక్రపాణి యాదవ్, కవులు రచ యితలు మారుతి, ఇనాయతుల్లా, సయ్యద్ జహీర్, విజయులు, శ్రీనివాస మూర్తి, నీలం వెంకటేశ్వర్లు, నాగమణి, విరసం నాయకులు పాణి, నాగేశ్వరాచారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

వన్‌స్టాప్ సెంటర్ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్ రుఖియాబేగం

కర్నూలు(హాస్పిటల్): ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మెంబర్ డాక్టర్ రుఖియాబేగం శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో ఉన్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను, మహిళల ఫిర్యాదులను పరిశీలించారు. బాధిత మహిళలు వసతి కోసం వచ్చినప్పుడు వారికి నాణ్యమైన భోజనం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేసిన మహిళలకు కౌన్సిలింగ్ ఇచ్చేటప్పుడు వారితో ఎలా మమేకమై వారి సమస్యను పరిష్కరిస్తున్నారని తెలుసుకున్నారు. ఆమెతో పాటు డీడబ్ల్యూసీడబ్ల్యూ ఈఓ నిర్మల, వన్‌స్టాప్ సెంటర్ సీఏ మేరీ స్వర్ణలత ఉన్నారు.

ఆదర్శప్రాయుడు కామ్రేడ్ నరసింహయ్య



టి.నరసింహయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): కామ్రేడ్ టి.నరసింహయ్య నేటి తరానికి ఆదర్శమని, ఆయన స్ఫూర్తితో పేదల పక్షాన పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కార్యదర్శి వర్గ సభ్యులు పి.నిర్మల, టి.రాముడు, పీఎస్ రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం పాతబస్తీలోని సుర్జీత్‌భవన్, కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో టి.నరసింహయ్య వర్ధంతిని పురస్కరించుకొని సీపీఎం నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసింహయ్య పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, సుధాకరప్ప, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిబంధనలు సరికాదు



మాట్లాడుతున్న కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): నిరుపేదలు ఇంటి స్థలం పొందేందుకు ప్రభుత్వం పెట్టిన పలు నిబంధనలు సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కె.జగన్నాథం అన్నారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇవ్వాలన్నారు. ఆ స్థలాను పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లో 5 ఎకరాలు, పట్టణ ప్రాంతాల్లో 2.5 ఎకరాల భూమి ఉండకూడదని, గతంలో ఇళ్లు మంజూరు కాని వారికే ఇస్తామనే నిబంధనలు తొలగించాలన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నాయకులు పంపన్నగౌడ, మహేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో రాణించాలి



మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేసిన డాక్టర్ వాసు రెడ్డి

కర్నూలు (టౌన్): విలువిద్య పోటీల్లో రాణించాలని వీఆర్ హాస్పిటల్ క్యాన్సర్ శస్త్ర చికిత్స వైద్యులు వాసు రెడ్డి అన్నారు. శనివారం స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఆర్చరీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఆయన మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లితండ్రులు పిల్లలను చిన్ననాటి నుంచే క్రీడల వైపు ప్రోత్సహించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం అండర్-8, అండర్-10 అండర్ 12, అండర్-14, అండర్-17, అండర్ 18 విభాగాల్లో బాల బాలికలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్చరీ సంఘం కార్యదర్శి నాగరత్నమయ్య పాల్గొన్నారు.

కేంద్రం నుంచి నిధుల వరద

● ఆదోని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ బి.పార్థసారథి

కర్నూలు(సెంట్రల్): కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధుల వరద పారుతోందని ఆదోని బీజేపీ ఎమ్మెల్యే బి.పార్థసారథి అన్నారు. కేంద్రం ఇచ్చే నిధులతో ఆరు నెలల్లో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, ఇదే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు నిదర్శనమన్నారు. శనివారం ప్రభుత్వ అతిథి గృహంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయకపోవడంతోపాటు దాన్ని లాభాల్లోకి తెచ్చేందుకు రూ.11,400 కోట్లు ఇచ్చిందన్నారు. విశా ఖ ఉక్కు పరిశ్రమకు గనులను కేటాయించే ప్రతిపాదన కూడా కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంద న్నారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి నేరుగా సర్పంచ్‌ల ఖాతాల్లోనే ఆర్థిక సంఘం నిధులను జమ చేస్తున్నట్లు చెప్పారు. 4, 6 లేన్లతో ఎక్కడ చూసినా జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు రామస్వామి, కాశీ, సాయిప్రదీప్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించండి

● కమిషనర్‌కు విన్నవించిన జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి



భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): నగరంలోని ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్ సమీపంలో పూర్తి కావచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సహకరించాలని పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి కోరారు. శనివారం సాయంత్రం స్థానిక నగరపాలకలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబును ఆయనతో పాటు లీగల్ సెల్ నాయకులు కలిశారు. నగరపాలక అధికారుల నోటీసులకు స్పందించిన ఆయన బిల్డింగ్‌కు సంబంధించిన అనుమతులు, వివరాలు తెలియజేశారు. కుడా అధికారుల షార్ట్‌ఫాల్‌కు సంబంధించి అడిగిన వివరాలను మరో 15 రోజుల వ్యవధిలో సమర్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గత ఏడాది జూన్ 17 వ తేదీన వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులు తీసుకున్నామన్నారు. అలాగే రివైజ్డ్ ప్లాన్, వీఎల్‌టీ ట్యాక్స్, ఫైర్ సేఫ్టీలను సమర్పిస్తామన్నారు.

పల్లెల్లో బెల్ట్‌షాపులు నిర్మూలించండి



ఈఎస్‌టీఎఫ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

కర్నూలు: పల్లెల్లో బెల్ట్‌షాపులను నిర్మూలించాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం డిమాండ్ చేసింది. సంఘం జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఉపాధ్యక్షులు సాయి ఉదయ్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం శనివారం ఈఎస్‌టీఎఫ్ ఏఈఎస్ రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రధాన రహదారుల్లోని ఇళ్లల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని ఆధారాలతో సహా ఏఈఎస్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో రహస్యంగా మద్యం సరఫరా చేసే నిర్వాహకుడు కూడా ప్రస్తుతం బహిరంగంగానే విక్రయాలు జరుపుతున్నారని డాబాను తలపించే విధంగా పల్లెల్లో బెల్ట్‌షాపులు వెలుస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే బెల్ట్‌షాపులపై విస్తృత దాడులు నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఏఈఎస్ రామకృష్ణారెడ్డి స్పందించి బెల్ట్ షాపులను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

నాగేశ్వరయ్యకు జాతీయ ప్రతిభా పురస్కారం



నాగేశ్వరయ్య

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ కవి, రచయిత, కళాకారుడు, ప్రవచన కర్త కేవీ నాగేశ్వరయ్య ׀తెలుగు కీర్తి׀ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. పురస్కారం ప్రదానం చేయనున్న శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈఓ కత్తి మండ ప్రతాప్ అధికారికంగా సమాచారం అందించినట్లు నాగేశ్వరయ్య తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు సంయుక్తంగా ఈనెల 21న విజయవాడంలోని శ్రీ కౌతాపూర్ణానంద విలాస్ కళావేదికలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. సాహిత్య, కళ, సామాజిక, ధార్మిక రంగాల్లో విశేష కృషి చేస్తున్నందుకు నాగేశ్వరయ్యకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఇటీవల విడుదలైన సీతారం సిత్రాల అనే తెలుగు సినిమాలో తండ్రి పాత్రలో ఆయన నటించారు. కీర్తి పురస్కారానికి ఎంపికైన నాగేశ్వరయ్యకు పలువురు సాహితీ వేత్తలు, కళాకారులు అభినందనలు తెలిపారు.

ఈ రోజు

● విద్యుత్‌లో అంతరాయం

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ లైన్ల సామర్థ్యం పెంపులో భాగంగా ఆదివారం వ్యవసాయ విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నన్నూరు 400 కేవీ నుంచి కాల్వబుగ్గ 220 కేవీ సబ్‌స్టేషన్ వరకు పాతలైన్ తీసివేసి కొత్తలైన్ ఏర్పాటు పనుల్లో భాగంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కర్నూలు, కె.వి.గూడూరు, ఎమ్మిగనూరు, మాధవరం, పత్తికొండ 132 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలోని వ్యవసాయ విద్యుత్ నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

● ఎస్టేట్ సబ్‌స్టేషన్ పరిధిలో..

సబ్‌స్టేషన్ ఫీడర్ నిర్వహణలో భాగంగా చెన్నమ్మ సర్కిల్ నుంచి కల్లూరు వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు ఈఈ శేషాద్రి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

● గోదా రంగనాథుల కల్యాణం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని గోదా గోకులంలో ధనుర్మాస వ్రత మహోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు గోదా రంగనాథుల వైభవ కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజు గుప్త తెలిపారు. అలాగే నిత్య కల్యాణం పచ్చ తోరణం కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు పేర్కొన్నారు. త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

● సాంఘిక నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి నెలా సాంఘిక నాటకంలో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. విజయవాడ దృశ్య వేదిక వారి ఆధ్వర్యంలో రాఘవ రచించి ఎస్.కె.మిశ్రో దర్శకత్వం వహించిన ׀కనక పుష్య రాగం׀ నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమ కన్వీనర్లుగా ఈశ్వరయ్య, యాగంటీశ్వరప్ప వ్యవహరిస్తారని తెలిపారు.

● సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు

కర్నూలు(సెంట్రల్): టి.నరసింహయ్య,వర్ధంతి, సీపీఎం రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని ఆదివారం రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీక్యాంపు టీజీవీ లలితకళా సమితిలో ఉదయం 10 గంటలకు నిర్వహించే సదస్సుకు వక్తలుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరవుతారన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు సిటీ: గుణంపల్లి పుల్లారెడ్డి చారిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ వృత్తి విద్య డిగ్రీ కోర్సుల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కాలర్‌షిప్‌లు పంపిణీచేశారు. కార్యక్రమానికి కర్నూలు మెడికల్ కాలేజ్, హృదయ, రక్తనాళ శస్త్రచికిత్స విభాగం ప్రొఫెసర్, హెచ్ఓడీ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డితోపాటు ట్రస్టు గౌరవ అధ్యక్షులు పి.సుబ్బారెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ జి.రాఘవరెడ్డి, ట్రస్టీ జి.ఏకాంబర రెడ్డి, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. పేద విద్యార్థులను చదువుతో ప్రోత్సహించేందుకు ట్రస్టు ద్వారా ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ట్రస్టు ద్వారా రూ.1 కోటి విలువైన స్కాలర్‌షిప్‌లు 250 మంది విద్యార్థులకు అందజేశారు.

రెవెన్యూలో మరో నలుగురు ఆర్‌ఐలకు చోటు

కర్నూలు (టౌన్): నగరపాలక రెవెన్యూ విభాగంలో మరో నలుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు చోటు లభించింది. గతంలో పనిచేసిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మరోసారి కమిషనర్ రవీంద్రబాబు అవకాశం కల్పించారు. సీనియారిటీ ఉండటంతోపాటు మరో రెండు నెలల వ్యవధిలో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున నలుగురికి బాధ్యతలు అప్పగిస్తూ శనివారం సాయంత్రం నగర పాలక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన ఈ విభాగంలో ఇప్పటికే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.శేషాద్రి అరోగ్య సమస్యలతో తనను తప్పించాలని కమిషనర్‌కు విన్నవించారు. దీంతో ఉన్న నలుగురు కొత్త వాళ్లతో ఆస్తి, నీటి పన్నుల వసూళ్లు, వీఎల్‌టీ, నూతన భవనాలకు పన్నుల విధింపు తదితర పనులు చేయడం ఇబ్బందిగా మారడంతో వారితో పాటు అదనంగా నలుగురికి బాధ్యతలు అప్పగించారు.

రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రభుత్వం నిర్లక్ష్యం

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షులు కె.బలరామ్ విమర్శించారు. శనివారం కర్నూలులోని ప్రజాపరిరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా డీటీఓ, ఆర్‌టీఓ అధికారుల్లో స్పందన లేదన్నారు. జాతీయ రహదారులపై ఆర్‌టీఓ అధికారులు తనిఖీలు నిర్వహించి మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్న వారి లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. సమావేశంలో సమితి నాయకులు హుసేనయ్య, సంజన్న, సూర్య ప్రదీప్, రాజు, రాజేష్, డేవిడ్, రమేష్, మోహన్‌రెడ్డి, క్రిష్ణబాపే పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు






ట్రాక్టర్ బైక్‌ను ఢీకొనడంతో గాయపడిన సుబహాన్, ప్యాలకుర్తి సమీపంలో బోల్తాపడిన లారీ

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలుకు వెళ్లే రోడ్డులో ప్యాలకుర్తి, కొత్తూరు గ్రామాల మధ్య చోటు చేసుకున్న రెండు ప్రమాదాల్లో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఆలూరు నుంచి పశుగ్రాసం లోడ్‌తో కర్నూలు వెళుతున్న లారీ ప్యాలకుర్తి దాటిన తర్వాత అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అలాగే గోనెగండ్ల మండలం లింగందిన్నె గ్రామానికి చెందిన సుబహాన్ కర్నూలు నుంచి తన ఇద్దరు కుమార్తెలతో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళుతుండగా, ప్యాలకుర్తి సమీపంలో ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుబహాన్ కాలుకు గాయాలయ్యాయి. ఇద్దరు బాలికలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

సి.బెళగల్: మండలంలోని తిమ్మందొడ్డి గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును కర్నూలు డీఎస్పీ బాబు ప్రసాద్ విచారణ చేశారు. శనివారం కోడుమూరు సీఐ తబ్రేజ్, స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డితో కలిసి గ్రామంలో బాధితులు, నిందుతులను విచారించారు. కాగా మండల పరిధిలోని మాల సోమాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామ శివారులో భూములున్న నందవరం మండలం సోముల గూడూరు గ్రామానికి చెందిన పరిగెల జాన్‌రాజుకు అదే గ్రామానికి చెందిన బోయ శ్రీనివాసులు, అతని కుటుంబ సభ్యుల మధ్య ఈనెల 9వ తేదీ పొలానికి సాగునీరు కట్టుకునే విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సి.బెళగల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు పరిగెల జాన్‌రాజు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ తిమ్మారెడ్డి ఈనెల 13వ తేదీ ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. శనివారం తిమ్మందొడ్డి గ్రామ శివారులోని పంట పొలాలు, ఘర్షణ పరిస్థితులను పరిశీలించిన డీఎస్పీ బాబు ప్రసాద్, కేసు సంబంధించిన అంశాలను, వారి వివరాలను నమోదు చేసుకున్నారు.

వైద్య ఆరోగ్యశాఖలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి. శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ మాట్లాడుతూ భారత్ మిషన్‌లో భాగంగా ప్రతి నెలా మూడో శనివారాన్ని స్వచ్ఛత దివస్‌గా పరిగణిస్తూ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్లలో శుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, కార్యాలయ పరిపాలన అధికారిణి అరుణ, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ శైలేష్‌కుమార్, డెమో శ్రీనివాసులు, ఎస్ఓ హేమసుందరం, డీపీహెచ్ ఎన్ఓ అన్నపూర్ణమ్మ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఏఎంఓ చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ ఎపడమాలజిస్టు వేణుగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి పాల్గొన్నారు.

ఎక్సైజ్ ప్రాంగణంలో..

కర్నూలు: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కంప చెట్లు, చెత్తాచెదారం తొలగించి శుభ్రం చేశారు. కార్యాలయం కాంపౌండ్‌లో పిచ్చిమొక్కలు ముళ్ల కంపలను తొలగించి శుభ్రం చేసినట్లు అసిస్టెంట్ ఎక్సైజ్ కమిషనర్ హనుమంతరావు తెలిపారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబుతోపాటు సీఐలు జయరామ నాయుడు, రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● కమిషనర్ రవీంద్రబాబు



స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్, స్థానికులు

కర్నూలు (టౌన్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. శనివారం సి.క్యాంపు కూడలిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. మానవహారం నిర్వహించి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. వ్యాపారులకు అవగాహన కల్పించారు. బి.క్యాంపులోని పాకెట్ పార్కులో స్వచ్ఛత పనులు చేపట్టారు. ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చెప్పారు. కార్యక్రమంలో రెండవ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, పర్యావరణ నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిశోర్ కుమార్, ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మెప్మా ఉద్యోగి వేధింపులు

● జీపీతో పడిపోయిన పొదుపు గ్రూప్ లీడర్
● ఆస్పత్రికి తరలించిన తోటి మహిళలు
● పార్టీ అంటగట్టి వేధిస్తున్నాడని బాధిత మహిళ ఆరోపణ




ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షఫీవున్

ఆత్మకూరు: స్థానిక మెప్మా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీసీ వెంకటేశ్వర్లు వేధింపులతో పొదుపు లక్ష్మి గ్రూప్ లీడర్ షఫీవున్ ఆస్పత్రి పాలైంది. బాధితురాలు తెలిపిన వివరాలు.. గ్రూపుల్లోని కొందరు మహిళలను(వైఎస్సార్‌సీపీకి చెందిన వారిని)టార్గెట్ చూసి వెలుగు సీసీ వెంకటేశ్వర్లు వేధింపులకు పాల్పడుతున్నాడు. శనివారం మెప్మా కార్యాలయంలో ఓబీసీ పొదుపు మహిళా సమావేశం నిర్వహించారు. సమావేశంలో షఫీవున్‌తోపాటు మరికొంతమంది పొదుపు మహిళలను సర్వేలు సరిగా చేయడం లేదని, ఇలా అయితే మెమోలు ఇస్తానని మందలించారు. అన్నీ సక్రమంగా చేసినా వేధింపులకు గురి చేయడంతో ఆందోళనకు గురైన షఫీవున్ ఒక్కసారిగా పడిపోయింది. దీంతో తోటి సభ్యురాళ్లు ఆమెను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. అనంతరం షఫీవున్ విలేరులతో మాట్లాడుతూ సర్వేల పేరుతో సీసీ కొంతమందిని మాత్రమే వేధిస్తున్నాడని ఆరోపించారు. అధికారులు సీసీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

కర్నూలు (టౌన్):నగరంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదేశించారు. శనివారం నగరంలోని అశోక్‌నగర్, నెహ్రూ నగర్, బి.క్యాంపు, కొత్తపేట, ఎస్.ఆర్.పేట ప్రాంతాల్లో కమిషనర్ తనిఖీలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సిబ్బందికి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉంటూ పరిశీలించాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు

వామ్మో.. కొండ చిలువ



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం కొండ చిలువ ప్రత్యక్షమైంది. కార్యాలయ ఆవరణలో గోడకు ఆనుకుని ఉండటాన్ని కార్యాలయ సిబ్బంది ఉదయం గమనించారు. వెంటనే కర్రలతో దానిని చంపివేశారు. ఈ కార్యాలయానికి పక్కనే ఉన్న ప్రాంతీయ శిక్షణ కేంద్రం (మేల్) ఆవరణలో పాత వాహనాలు సంవత్సరాలుగా నిలిపి ఉంచడంతో అవి తుప్పుపట్టిపోయాయి. దాంతో పాటు ఆ ప్రాంతమంతా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉంది. ఈ కారణంగా ఇక్కడ పాములు ఉండేందుకు ఆస్కారం ఏర్పడింది. వాహనాల్లోని తుప్పును, ఎలుకలను తింటూ పాములు జీవిస్తున్నాయి. జన సంచారం లేని సమయంలో బయటకు వస్తున్నాయని, కార్యాలయంలోకి వస్తే పరిస్థితి ఏమిటని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)

పనివేళల్లో వైద్యులు విధుల్లో ఉండాలి



ఆసుపత్రి అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనివేళల్లో కచ్చితంగా విధుల్లో ఉండాలని అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శనివారం ఆయన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పలు విభాగాలను పరిశీలించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అమలయ్యేలా చూడాలన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో అన్ని హంగులతో ప్రారంభించేందుకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగానికి సీఎంఓలతోపాటు మిగతా సిబ్బందిని కేటాయించాలని ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఆక్సీజన్, సివిల్, పరికరాల గురించి వైద్యాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆయన వెంట కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్ పాల్గొన్నారు.